క్లుప్తంగా

అగ్నిప్రమాద కుటుంబానికి ఆర్థిక సాయం



ప్రమాద బాధిత కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందిస్తున్న సతీష్‌రావు తదితరులు

రామచంద్రపురం రూరల్: మండలంలోని హసన్‌బాదలో కడియాల వీర వేంకటలక్ష్మికి చెందిన తాటాకిల్లు ప్రమాదవశాత్తూ అగ్నిప్రమాదానికి గురైంది. ఇంటితో పాటు సామాన్లు కూడా కాలిపోవడంతో సుమారుగా రూ.లక్ష ఆర్థికంగా నష్టం వాటిల్లింది. సర్పంచ్ నాగిరెడ్డి సతీష్‌రావు, సెక్రటరీ వి.సుబ్రహ్మణ్యం, వలంటీర్స్, రెవెన్యూ సిబ్బంది, వార్డు సభ్యులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకొని వారిని పరామర్శించి కొంత ఆర్థికసాయం అందించారు.

వరి పంటలో జింకు ధాతు లోపం



కాజులూరు మండలం గొల్లపాలెంలో జింకుధాతులోపం తలెత్తిన వరిపంట

కాజులూరు: మండల గ్రామాల్లోని పలుచోట్ల వరిపంటపై ప్రస్తుతం జింకుధాతు లోపం తలెత్తడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో మొత్తం 24,500 ఎకరాల సాగుభూమి ఉండగా ఈ ఏడాది రబీలో 19 వేల ఎకరాల్లో రైతులు వరిసాగు చేపట్టారు. మండలంలో ప్రస్తుతం దాదాపు వరి నాట్లు పూర్తి కాగా ముందరగా వెదచల్లిన, నాట్లు వేసిన పొలాల్లో పంట దుబ్బు గట్టిపడే దశ నుంచి పిలకలు తొడిగే దశలో ఉన్నాయి. అయితే ముందరగా నాట్లు వేసిన పొలాల్లో అక్కడక్కడా కాండం తొలుచుపురుగు, లద్దె పురుగు ఆశించిందని అధిక శాతం పొలాల్లో జింకుధాతు లోపాలు కనిపిస్తున్నాయని రైతులు చెబుతున్నారు. జింకు ధాతు లోపం ఏర్పడితే వరి ఆకుసుతలపై తుప్పు రంగు మచ్చలు ఏర్పడుతున్నాయని అవి క్రమేపీ కలిసిపోయి ఆకు అంతా గోధుమ రంగులోకి మారిపోతుందని రైతులు అంటున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి వి.అశోక్‌ను వివరణ అడగ్గా వరి మొక్కకు జింక్ అనేది తక్కువ పాళ్లలోనే అవసరం అవుతుందని అయినప్పటికీ అది తగ్గితే జింకుధాతులోపం తలెత్తి పంటకు నష్టం వాటిల్లుతుందన్నారు. వాతావరణంలో చలి ఎక్కువగా ఉన్నప్పుడు వరిపంటపై జింకులోపం ఎక్కువగా కనిపిస్తుందన్నారు. దీంతో పంట ఏ విధమైన పోషకాలను గ్రహించలేదని, మొక్క క్రమేపీ ఎదుగుదల లేక గిడసబారి పోతుందన్నారు. ఈ ఆకును విరిచినప్పుడు లోహపు శబ్దం వినిపిస్తుందన్నారు. జింకుధాతు లోపం నివారణకు జింక్‌సల్ఫేట్ నాలుగు వందల గ్రాముల మందును రెండు వందల లీటర్ల నీటిలో కలిపి మూడు రోజుల వ్యవధిలో ఎకరం పంటపై రెండు సార్లు పిచికారీ చేయాలన్నారు. రైతులు పక్క రైతులను అనుసరిస్తూ అవసరం లేకుండానే ఇష్టమొచ్చిన ఎరువులు, మందులు పంటలపై వినియోగిస్తున్నారని దీనివల్ల అనవసరపు ఖర్చులు అవటమే కాకుండా పంటకు నష్టం జరుగుతుందన్నారు. పంటపై సోకే తెగుళ్లను రైతులు ఎప్పటికప్పుడు గ్రహిస్తూ వ్యవసాయాధికారుల సూచనల మేరకు నివారణ చర్యలు చేపట్టుకోవాలన్నారు.

స్విమ్మింగ్‌లో ఉచిత శిక్షణ



శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం: మండలంలోని ర్యాలి గ్రామంలో స్థానిక కెనాల్ పక్కన పిల్ల కాలువలో అనూస్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రావులపాలెం సామ్ అడ్వాన్స్‌డ్ ఫిజియోథెరపీ అండ్ రిహేబిలిటేషన్ సెంటర్ అధినేత డాక్టర్ మోహిత్ సౌజన్యంతో చిన్నారులకు ఉచిత స్విమ్మింగ్ శిక్షణ తరగుతులను ప్రారంభించారు. మోహిత్ మాట్లాడుతూ దైనందిక జీవితంలో స్విమ్మింగ్ ఒక భాగం అయితే ఫిజికల్ హెల్త్ సాధ్యపడుతుందన్నారు. అనంతరం శిక్షకుడు గడ్డం వెంకట్రావు చిన్నారులకు స్విమ్మింగ్‌లోని మెళకువలు నేర్పారు.

నాణ్యతతోనే వ్యాపారాభివృద్ధి

అంబాజీపేట: నాణ్యతా ప్రమాణాలు పాటించి వినియోగదారుల్లో నమ్మకాలు పెంచితే వ్యాపారాభివృద్ధి చెందుతుందని అంబాజీపేట, అయినవిల్లి ఎస్సైలు ఎ.చైతన్యకుమార్, కె.రమేష్‌కుమార్ అన్నారు. అంబాజీపేట గోఫ్రెష్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని నిర్వహించిన లక్కీ డ్రాను శనివారం తీశారు. గెలుపొందిన వినియోగదారులకు ఎస్సైల చేతుల మీదుగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌సీ పి.శ్రీను, కానిస్టేబుల్ చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

చివరి మజిలీకి తప్పిన అగచాట్లు

- రావిపాటి వారి దాతృత్వం
- రూ.50 లక్షలతో మహాప్రస్థానం నిర్మాణం
- రూ.10 లక్షలతో కైలాస రథం బహూకరణ

రామచంద్రపురం: పల్లెలు అభివృద్ధి చెందుతున్నాయి. రియల్ ఎస్టేట్ పుణ్యాన లేఅవుట్‌లు కూడా కుప్పలు తెప్పలుగా వెలుస్తున్నాయి. కానీ చివరి మజిలీకి మాత్రం ఎక్కడా కాస్త స్థలం కూడా ఉండనివ్వడం లేదు. పట్టణాలతో పాటుగా పల్లెల్లో కూడా మరణించిన వారికి అత్యుత్తమ సంస్కారం చేసేందుకు నానా పాట్లు పడాల్సిన రోజులివి. రామచంద్రపురం నియోజకవర్గం పుణ్య గౌతమీ నదీ తీరాన ఉన్న మహాప్రస్థానం కోసం మహా పాట్లు పడాల్సి వస్తుంది. వీటన్నింటిని ఎంతో కాలంగా చూస్తున్న కొంత మంది దాతలు ఈ సమస్యను పరిష్కరించేందుకు ముందుకు వచ్చారు.

ఎన్నో వ్యయ ప్రయాసలు

నియోజకవర్గంలోని కె.గంగవరం మండలంలో అంతిమ సంస్కారం నిర్వహించేందుకు గత కొంత కాలంగా ఎంతో శ్రమ పడాల్సిన పరిస్థితులు. ఎవరైనా మరణిస్తే గోదావరి సమీపాన కోటిపల్లికి గాని, రామఘట్టాల వద్దకు లేదా, రాజమహేంద్రవరం గోదావరి నది ఒడ్డుకు తీసుకువెళ్లాలి. ఇది ఎంతో వ్యయంతో కూడుకున్న పని. పేదలు, మధ్య తరగతి ప్రజలు దీనిని భరించలేకటీకి డ్రైన్ గట్టునే అంతిమ సంస్కారాలను కానిచ్చేస్తున్నారు. అంతిమ సంస్కారం ఘనంగా చేయాల్సి ఉన్నా, చేసేది లేక ఇలా డ్రైన్ నది ఒడ్డునే జరుగుతున్నాయి. ఇక వర్షాకాలంలో అయితే పరిస్థితులు మరింత గడ్డుగా ఉంటాయి.



గౌతమీ గోదావరి ఒడ్డున దంగేరు రామఘట్టాల వద్ద నిర్మించిన మహా ప్రస్థానం

రావిపాటి వారి దాతృత్వం:

కె.గంగవరం మండలం దంగేరు గ్రామానికి చెందిన రావిపాటి వంశీయులు కొన్ని తరాల పాటుగా పంచాయతీ సర్పంచ్‌లుగా, కపిలేశ్వరపురం సమితీ ప్రెసిడెంట్‌లుగా రాజకీయంగా ఎంతో గుర్తింపు ఉన్న వంశీయులు కె.గంగవరం, దంగేరు, తదితర గ్రామాల ప్రజలు అంతిమ సంస్కారం బాధలు తీర్చాలని తలచారు. దీంతో రావిపాటి వంశీయులైన మాజీ సర్పంచ్‌లు రావిపాటి వెంకటగణేష్, రావిపాటి రవీంద్రనాథ్‌చౌదరి, రావిపాటి రవికుమార్‌లు ఈ సమస్యకు చెక్ పెట్టారు. దంగేరు సమీపాన గౌతమీ గోదావరి నది వద్ద రూ.50 లక్షలతో మహాప్రస్థానం నిర్మించారు. సుధర్మ ఇన్‌ఫ్రా కంపెనీ రూ.15 లక్షలు సహకారం అందించగా మిగిలిన రూ.35 లక్షలను రావిపాటి వంశీయుల సహకారంతో నూతన హంగులతో మహాప్రస్థానం నిర్మించారు. అంత్యక్రియలు చేసే భవనంతో పాటుగా గోదావరిలో స్నాన ఘట్టం, పక్కనే విశ్రాంతి భవన నిర్మాణం చేశారు. మహాప్రస్థానం భవనంలో కావాల్సిన విద్యుత్ సౌకర్యాన్ని కూడా ఏర్పాటు చేశారు.



కైలాస రథాన్ని బహూకరిస్తున్న రావిపాటి రవికుమార్

> **మంచి చేయాలని తలచి**
>
> 
>
> అంత్యక్రియలు జరిపేందుకు ఎంతో కాలంగా దంగేరు పరిసర ప్రాంత ప్రజలు ఎన్నో కష్టాలను ఎదుర్కొంటున్నారు. వాటిని పరిష్కరించేందుకు రావిపాటి కుటుంబీకులం అందరూ కలిసి మహా ప్రస్థానం నిర్మించాలని తలచాము. మా అందరి సహకారంతో దీనిని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చాం.
>
> – రావిపాటి వెంకటగణేష్‌చౌదరి, మాజీ సర్పంచ్, దంగేరు

కైలాసరథం బహూకరణ

దంగేరు గ్రామానికి చెందిన రావిపాటి వెంకటాద్రి–అనంతలక్ష్మిల జ్ఞాపకార్థం ఆయన మనుమడు రావిపాటి రవికుమార్ రూ.10 లక్షలతో కైలాస రథాన్ని బహూకరించారు. మండలంలో మహాప్రస్థానం వద్దకు తరలించేందుకు అన్ని ఏర్పాట్లతో తయారు చేసిన నూతన కైలాస రథాన్ని ఆయన అందజేశారు. మహా ప్రస్థానం వద్దకు తీసుకువెళ్లేందుకు కావాల్సిన వారు మొబైల్ నంబర్ 8297000666కు కాల్ చేస్తే కైలాస రథం వస్తుంది. అందులో మరణించిన దేహాన్ని తరలించుకునే విధంగా వారు దీనిని తయారు చేసి అందజేశారు. పల్లెటూళ్లలో చాలా కాలం తరువాత అంతిమ సంస్కారానికి ఇటువంటి సౌకర్యాలను ఏర్పాటు చేసిన రావిపాటి వంశీయులను మండల ప్రజలు అభినందిస్తున్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు సాహితి ఎంపిక



పిల్లి సాహితి

రాయవరం: నేషనల్ మెరిట్ కమ్ మీన్స్ స్కాలర్‌షిప్‌కు మండలంలోని వెంటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని పిల్లి సాహితీ మానస ఎంపికైంది. ఈ విషయాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి. సత్తిరాజు ఆదివారం విలేకరులకు తెలిపారు. ఎనిమిదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షలో సాహితీ మానస ఎంపికవడంపై వెంటూరు సర్పంచ్ వాసంశెట్టి వెంకట్రావు పీఎంసీ చైర్మన్ వాసంశెట్టి వెంకటరమణ హర్షం వ్యక్తం చేశారు.

పసలపూడిలో తాటాకిల్లు దగ్ధం



దగ్ధమవుతున్న తాటాకిల్లు

రాయవరం: మండలంలోని పసలపూడి నరాలవారి పాలెంలో శనివారం రాత్రి గ్యాస్ లీకేజ్ కారణంగా తాటాకిల్లు దగ్ధమైంది. ప్రమాదానికి గురైన ఇంట్లో కట్ట సుబ్బయ్యమ్మ ఆమె కుమారుడు దివ్యాంగుడైన శ్రీనివాస్ నివాసం ఉంటున్నారు. ప్రమాదంలో ఇంటి మరమ్మతుల నిమిత్తం తెచ్చుకున్న రూ. 20 వేల ఇంటి డాక్యుమెంట్లు సామగి, మంటల్లో కాలి బూడిదైనట్లు బాధితులు వాపోయారు.

జగనన్న పాలనలో అర్హులందరికీ పథకాలు

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలోని అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎంపీపీ మాత భారతి అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లపాలెంలో కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడుతూ పాదయాత్రలో అవ్వా, తాతల కష్టాలు చూసిన వైఎస్ జగన్మోహన్‌రెడ్డి తాను అధికారంలోకి వస్తే నెలవారీ ఫించన్ రూ.రెండు వేలు నుంచి మూడు వేలకు పెంచుతూ పోతానని వాగ్దానం చేశారని ఆ హామీ మేరకు అధికారం చేపట్టిన తర్వాత రూ.2250కు పెరిగిన పింఛను నేడు రూ.మూడువేలుకు చేరిందన్నారు. పింఛన్ల కోసం అవ్వా, తాతలు, వికలాంగులు కార్యాలయాల చుట్టూ తిరగనవసరం లేకుండా వలంటీర్ల ద్వారా జగనన్న గడప వద్దకే పింఛన్లు అందజేసే కార్యక్రమం దేశానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. కార్యకర్తలు జగనన్న పథకాల ద్వారా ప్రజలకు జరిగిన మేలు వివరిస్తూ రానున్న ఎన్నికలలో పార్టీ మరోసారి అధికారంలోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల ప్రధాన కార్యదర్శి పోతురాజు బాబూరావు, పార్టీ మండల సేవాదళ్ అధ్యక్షుడు టేకుమూడి దుర్గారావు, పార్టీ నాయకులు మాత మురళి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు ప్రసంగం హాస్యాస్పదం

- ప్రజలకు దూరం కావడంతో నిరాధార ఆరోపణలు
- జగన్ సంక్షేమ పాలనను విమర్శిస్తే ప్రజలే బుద్ధి చెబుతారు
- మండపేట అభివృద్ధిని ఓర్వలేని విపక్షాలు
- రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీదే విజయం
- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ధ్వజం

కపిలేశ్వరపురం (మండపేట): 'రా కదలిరా..' పేరుతో మండపేటలో శనివారం నిర్వహించిన బహిరంగ సభలో ప్రతిపక్షనేత చంద్రబాబు ప్రసంగం హాస్యాస్పదంగా ఉందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఎద్దేవా చేశారు. సభకు ప్రజాదరణ లేకపోవడంతో లేనిపోని నిరాధారమైన ఆరోపణలు చేశారన్నారు. సీఎం వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి పాలనపైనా, మండపేట నియోజకవర్గంలో తాను ప్రజా ప్రయోజనాలు కోసం చేస్తున్న కృషిపైనా చంద్రబాబు, స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు చేసిన ఆరోపణలను ఎమ్మెల్సీ తోట ఖండించారు. పట్టణంలోని తన కార్యాలయంలో ఆదివారం మాట్లాడారు. తాను మండపేట కో– ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టాక విశేషంగా ప్రజలు ఆదరిస్తున్నారన్నారు. చంద్రబాబు బహిరంగ సభకు మొత్తం కోనసీమ జిల్లా నుంచి జనాన్ని సమీకరించినా ఫలితం లేకపోయిందన్నారు. ప్రజాదరణ కోల్పోయిన స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావును జాకీలతో పైకి లేపడానికే అమలాపురంలో కాదని మండపేటలో బహిరంగ సభ నిర్వహించారన్నారు.

ప్రతిపక్ష నాయకులకు సిగ్గుండాలి

తాను రూ.500 కోట్లు అవినీతికి పాల్పడ్డానంటూ విమర్శలు చేసేందుకు ప్రతిపక్ష నాయకులకు సిగ్గుండాలని ఎమ్మెల్సీ తోట ఖండించారు.. 2014–2019 టీడీపీ పాలనా కాలంలో కోరుమిల్లిలోని ఇసుక ర్యాంపు వద్ద మహిళలను విచక్షణ రహితంగా పోలీసులతో కొట్టించి పక్క నియోజకవర్గంలోని పోలీసు స్టేషన్‌కు తరలించి హింసించారన్నారు. కాగా తాను వారిని విడిపించానన్నారు. ఇసుకాసురుడంటూ ఈనాడు దినపత్రికలో జోగేశ్వరరావు అవినీతిపై రాశారని గుర్తు చేశారు. ప్రస్తుత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ఎమ్మెల్యేల ప్రమేయం కూడా లేకుండా ఆక్షన్ పద్ధతిలో ఇసుక సరఫరా చేస్తోందన్నారు. తాను గ్రావెల్ అక్రమాలకు పాల్పడుతున్నానని ఆరోపించిన ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావును మహిళలు చీపుర్లతో కొడతామంటూ హెచ్చరించారని గుర్తు చేశారు. ఇళ్ళు, రహదారులు నిర్మాణాలతోపాటు ఇతర ప్రజోపకార పనులకు చట్ట పరిధిలో గ్రావెల్‌ని తరలిస్తే ఆరోపించడం సరికాదన్నారు. తాను రానున్నది ఏ ప్రభుత్వమో ముందే పసికట్టి ఆ పార్టీలో చేరతానంటూ సాక్షాత్తూ చంద్రబాబే అనడం సంతోషంగా ఉందన్నారు. చంద్రబాబు నోటివెంటే రానున్నది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమని చెప్పారన్నారు. మండపేటలో రౌడీయిజం రాజ్యమేలుతుందంటూ చేసిన ఆరోపణలు అవాస్తవమన్నారు. ఇళ్ళ నిర్మాణాలకు డబ్బులు వసూలు చేస్తున్న అసాంఘిక శక్తులను చట్టపరిధిలో నియంత్రించిన చరిత్ర తనదన్నారు. ప్రభుత్వ పాలనను విమర్శించే హక్కు చంద్రబాబుకు లేదన్నారు. 30 లక్షల మందికి ఇళ్ళు కట్టి ఇస్తున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందని, టిడ్కో ఇళ్ళ బ్యాంకు రుణాలను ప్రభుత్వమే తీర్చుతుందని గుర్తుచేశారు. టీడీపీ హయాంలో కనీసం సెంటు కూడా ప్రైవేటు భూమి కొని ఇళ్ళ స్థలాలుగా ఇవ్వలేదన్నారు. సంక్షేమ పాలనపై విమర్శలు చేస్తే రానున్న ఎన్నికల్లో ప్రజలే బుద్ధి చెబుతారన్నారు. చంద్రబాబు పాలనలో బషీర్‌బాగ్‌లో కాల్పులు జరిపి ముగ్గురు చావుకు కారణమయ్యాడని, ఆయన విద్యుత్ చార్జీలు పెంచుతున్నారంటూ చేసిన విమర్శలకు విలువ లేదన్నారు. సమావేశంలో మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ నూక దుర్గారాణి, కో ఆప్షన్ సభ్యుడు రెడ్డి రాధాకృష్ణ, వైఎస్సార్ సీపీ జగ్గంపేట నియోజకవర్గ పరిశీలకుడు వేగుళ్ళ పట్టాభిరామయ్య చౌదరి, పార్టీ రాష్ట్ర కార్యదర్శి కర్రి పాపారాయుడు, ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాస్, సర్పంచ్ బూరిగ ఆశీర్వాదం, కౌన్సిలర్లు, నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిదులు, నాయకులు పాల్గొన్నారు.



మండపేటలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ తోట

శ్రీరాముని ఆశీస్సులు అందరికీ ఉండాలి

రామచంద్రపురం: అయోధ్య శ్రీరాముని ఆశీస్సులు అందరికీ ఉండాలని దేశం, రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని శ్రీరామున్ని కోరుకుంటున్నామని ది రామచంద్రపురం మొబైల్ షాప్ ఓనర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కంచుమర్తి బాబూరావు అన్నారు. అయోధ్యలోని శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠను పురస్కరించుకుని పట్టణంలోని ప్రధాన రహదారిలో శ్రీరాముని జెండాలతో శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి షాపు వద్ద శ్రీరాముని జెండాలను కట్టారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న రామమందిరంలోని శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం నేటికి జరగటం ఎంతో సంతోషదాయకమన్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గంగరాజు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు భార్గవరెడ్డి, కార్యదర్శి రాజా, ట్రెజరర్ నాగేశ్వరరావు, ఎస్వీఆర్ రెడ్డి, రాంబాబు, సురేష్, జియో రాజు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో నేడు శోభాయాత్ర

రామచంద్రపురం రూరల్: అయోధ్యలోని శ్రీరామ విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని పురస్కరించుకుని ద్రాక్షారామ మాణిక్యాంబ సమేత భీమేశ్వరాలయం వద్ద నుంచి గ్రామంలో నేడు శోభాయాత్రను నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో పి.తారకేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7 గంటలకు జరిగే శోభాయాత్ర అనంతరం భజన కోలాటాల నృత్యకార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. అయోధ్యలో జరిగే ప్రతిష్ఠా క్రమాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఎల్ఈడీ స్క్రీన్లపై ప్రత్యక్ష ప్రసారాన్ని భక్తులు తిలకించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. అనంతరం ప్రసాదాన్ని అందజేస్తారని భక్తులందరూ విచ్చేసి అయోధ్య బాలరాముని విగ్రహ ప్రతిష్ఠను కనులారా వీక్షించి ప్రసాదాన్ని స్వీకరించాలని ఈవో విజ్ఞప్తి చేశారు.



ప్రధాన రహదారిలో యూనియన్ ఆధ్వర్యంలో శోభాయాత్రను చేస్తున్న శ్రీరామభక్తులు



అయోధ్య రాముని అక్షతలు వితరణ చేస్తున్న గ్రామస్తులు

అయోధ్య అక్షతల వితరణ

రాయవరం: మండలంలోని పసలపూడి గ్రామంలో ఆదివారం అయోధ్య రాముని అక్షతలు వితరణ కార్యక్రమం జరిగింది. పండితుల వేదమంత్రోచ్ఛరణల నడుమ భాజా భజంత్రీలు, సన్నాయిలతో గ్రామంలోని 9 రామాలయాలకు వెళ్లి అక్షతలను వితరణ చేశారు. ప్రముఖ పారిశ్రామికవేత్త చింతా కృష్ణా రెడ్డి, స్థానిక నేతలు చింతా సుబ్బారెడ్డి, పడాల అబ్బారెడ్డి, మల్లిడి రామారెడ్డి, పోతంశెట్టి సత్తిబాబు, చిన్నం సత్తిబాబు, పసలపూడి సత్య సాయి సంఘం, రామాలయాల పెద్దలు పాల్గొన్నారు.

ముత్యాలమ్మా.. మమ్మేలవమ్మా

- వైభవంగా అమ్మవారి గ్రామోత్సవం
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

రాయవరం: ముత్యాలమ్మా ..కాపాడి రక్షించవమ్మా..మా పిల్లా పాపలను, పాడిపంటలను, పసుపు కుంకాలను చల్లగా చూడమ్మా అంటూ మహిళలు ముత్యాలమ్మ వారిని వేడుకున్నారు. అమ్మవారికి అడుగడుగునా పుసుపు నీళ్లతో స్వాగతించి, పసుపు, కుంకుమ, నైవేద్యాలు సమర్పించుకున్నారు. గ్రామ దేవత పోలమ్మ అమ్మవారి జాతరకు ముందుగా రాయవరంలో ఏటా ముత్యాలమ్మ వారి జాతర నిర్వహించడం ఆనవాయితీ. అందులో భాగంగా ఆదివారం ఉదయం ముత్యాలమ్మ వారి గ్రామోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. కొప్పు వెలమ కులస్తుల ఆరాధ్య దైవంగా కొలవబడుతున్న ముత్యాలమ్మ వారికి కొప్పు వెలమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జాతర నిర్వహించారు. జాతరలో భాగంగా ఉదయం అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా తయారు చేసిన వాహనంలో ఊరేగించారు. అమ్మవారి ఉత్సవ విగ్రహానికి ముందు నడిచే ముత్తైదువుల కాళ్లపై మహిళలు బిందెలతో పసుపు నీళ్లను పోసి అమ్మవారిని స్వాగతించారు. మంగళ వాయిద్యాలతో అమ్మవారి ఊరేగింపు సాగింది. కొందరు మహిళలు నెత్తిపై ఘంటాదీపాన్ని శిరస్సున ధరించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున బాణసంచా కాల్చారు. ఉత్సవ కమిటీ అధ్యక్షుడు నౌడు వెంకటరమణ, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గ్రామోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన గరగ నత్యాలు, వాయిద్యాలకు అనుగుణంగా గరగ నత్య కళాకారులు చేసిన అభినయం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అలాగే తీన్‌మార్, గారడీలు, కోలాటం వంటి సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.



రాయవరం ముత్యాలమ్మ అమ్మవారి గ్రామోత్సవంలో భక్తులు

పళ్లాలమ్మకు లక్ష చామంతి పూజ

కొత్తపేట: మండలంలోని వానపల్లి గ్రామదేవత పళ్లాలమ్మ అమ్మవారికి ఆదివారం లక్ష చామంతి పూజ వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ కామిశెట్టి అమ్మన్న, ఈవో బొక్కా వీర వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ పూజల్లో 235 జంటలు పాల్గొన్నారు. పూజ అనంతరం వాకాడ తిరుమలరావు సహకారంతో అన్నసమారాధన జరిగింది.

లెక్క పక్కాగా ఉండాలని..

- కులగణనకు శ్రీకారం
- క్షేత్ర స్థాయిలో చురుగ్గా సాగుతున్న సర్వే
- క్లస్టర్ పరిధిలో 2,657 సిబ్బంది నియామకం

రాయవరం: బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో 1931లో కులగణన జరిగింది. ఆ తర్వాత ఇంత వరకూ చేయలేదు. వివిధ రకాల సర్వేలు, లెక్కలు చేసినప్పటికీ ఉప కులాలు, కులాల పేర్లతో గణన నిర్వహించలేదు. కేవలం ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ ఇలా మాత్రమే గణన చేశారు. ఈసారి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కులం పేరిట గణన చేపట్టింది. అనివార్య కారణాలతో ఇప్పటికే రెండుసార్లు ఈ కార్యక్రమం వాయిదా పడింది. కులగణన లెక్కలు పక్కాగా తేల్చేందుకు నిర్వహిస్తున్న ఈ ప్రక్రియపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. శుక్రవారం నుంచి క్లస్టర్ పరిధిలో ప్రారంభమైన కులగణన చురుగ్గా సాగుతోంది.

ప్రత్యేక యాప్‌లో నమోదు

ఈసారి కులగణను గ్రామ, వార్డు సిబ్బంది నిర్వహిస్తున్నారు. ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. ప్రతి ఇంటి డేటా యాప్‌లో ముందుగానే పొందుపరిచి ఉంటుంది. వాటిని సరిచేసుకుని కుటుంబ పెద్ద ఆమోదించాల్సి ఉంటుంది. మొదటి దశలో ఇల్లు, భూములు, ఇతర వివరాలు, రెండో దశలో కులం, ఉప కులం, మతం, ఇతర వివరాలను ధ్రువీకరించాల్సి ఉంటుంది.

93 ఏళ్ల తర్వాత కుల గణన

దేశంలో తొలిసారి 1872లో తొలిసారి జనగణన ప్రారంభమైంది. ప్రతి పదేళ్లకు ఒకసారి జనగణనతో పాటుగా కులగణన యథావిధిగా నిర్వహించేవారు. 1931లో చివరగా పూర్తి స్థాయిలో కులగణన నిర్వహించగా, ఆ తర్వాత 1941లో జనగణన చేసినప్పటికీ రెండో ప్రపంచ యుద్ధ పరిస్థితుల కారణంగా జనగణన, కులగణన పూర్తి స్థాయిలో చేపట్టలేదు. 1951లో జనగణన చేసినప్పటికీ, కులగణన పూర్తి స్థాయిలో జరగలేదు. ఎస్సీ, ఎస్టీలను మినహాయించి మిగిలిన గణన కులాల వారీగా చేపట్టలేదు. సుమారు 93 ఏళ్ల తర్వాత ఇప్పుడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కులగణన చేపట్టేందుకు చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని చెప్పవచ్చు.

జీవన ప్రమాణాల మెరుగుకు..

కులగణన ద్వారా కులాలు, ఉప కులాల సంఖ్య తేటతెల్లమవుతుంది. కులగణన తర్వాత ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు అవసరమైన ప్రణాళికలను ప్రభుత్వం రూపొందించడానికి ఉపకరిస్తుంది. గణన పూర్తయ్యాక సచివాలయాల పరిధిలో 10 శాతం ఇళ్లలో రీ వెరిఫికేషన్ చేసి, గణన వివరాలను సరిపోల్చే అవకాశముంది.



కులగణన చేస్తున్న సిబ్బంది

క్లస్టర్ పరిధిలో ఇదీ పరిస్థితి

రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల పరిధిలోని రామచంద్రపురం, మండపేట మున్సిపాలిటీలతో పాటుగా, మండపేట, రాయవరం, కపిలేశ్వరపురం, రామచంద్రపురం, కె.గంగవరం మండలాల్లో 132 సచివాలయాలు ఉన్నాయి. ఈ సచివాలయాలను 2,657 క్లస్టర్లుగా విభజించారు. ఈ క్లస్టర్ల పరిధిలో 61,319 కుటుంబాలను సిబ్బంది సర్వే చేయనున్నారు. క్లస్టర్ పరిధిలోని 4,36,735 మంది వివరాలను కులగణనలో సేకరించనున్నారు. కులగణన నిమిత్తం ఇప్పటికే సిబ్బందికి జిల్లా, మండల, గ్రామ స్థాయిలో శిక్షణ ఇచ్చారు. కులగణన సర్వే ద్వారా ఏ కులాల వారు.. ఎంత సంఖ్యలో ఉన్నారనేది గణాంకాలతో లెక్క పక్కాగా తేలనుంది.

గోశాల ప్రారంభం

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయ ప్రాంగణంలో దాత విరాళంతో నిర్మించిన గోశాలను ఆదివారం ప్రారంభించారు. మురముళ్లకు చెందిన చీకట్ల సత్యం, సత్యవతి స్మారకార్థం వారి కుటుంబ సభ్యులు ఇచ్చిన రూ.6 లక్షల విరాళంతో ఈ గోశాలను నిర్మించారు. మంగళ వాయిద్యాలు, వేద మంత్రాలు, భక్తుల కోలాహలం నడుమ గోశాలను చీకట్ల చిన్నయ్య, ఆదిలక్ష్మి, చీకట్ల నాగేశ్వరరావు, సూర్యకుమారి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గోకులంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోవుకు పూజలు చేశారు. ఇక నుంచి భక్తులు గోకులంలో గోపూజ చేయించుకునే అవకాశం ఉంటుందని ఆలయ ఈఓ గ్రంధి మాధవి తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, కొమ్ముల సూరిబాబు, గూటం శ్రీనివాస్, దాత కుటుంబ సభ్యులు బద్రి యశ్వంత్, లక్ష్మీలాస్య, చీకట్ల సత్యనారాయణ, లక్ష్మీ నాగసంధ్య ప్రణయ శ్రీకేష్, ఆలయ అర్చకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.